
BHARATH SAMACHAR DIGITAL

20, ఆగస్టు 2026, గురువారం భారత్ సమాచార్

పైలట్ నుంచి ప్రధానమంత్రి వరకు



భారత్ సమాచార్, హైదరాబాద్: సాధారణంగా దేశ రాజకీయాలు అంటే వృద్ధ నాయకులే గుర్తుకు వస్తారు కానీ, కేవలం 40ఏళ్ల వయసులోనే భారత ప్రధానమంత్రి పీఠాన్ని అధిరోహించిన యువ నాయకుడు ఎవరో తెలుసా..?, దేశంలో కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్స్, ఆధునిక సాంకేతికత గురించి పెద్దగా అవగాహన లేని సమయంలో భారతదేశం 21వ శతాబ్దంలోకి అడుగుపెట్టాలని కలలు కన్న నాయకుడి గురించి మీరు ఎప్పుడరైనా విన్నారా. ఆయనే రాజీవ్ గాంధీ. ఆయన రాజకీయ జీవితం చాలా చిన్నదే. కానీ ఆ కొద్ది కాలంలోనే భారత రాజకీయాలు, సాంకేతిక రంగం, విద్య, పరిపాలనపై తనదైన ముద్ర వేశారు. ఆధునిక భారతదేశానికి పునాది వేసిన నాయకుడిగా ప్రశంసలు అందుకున్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20న బొంబాయిలో, అంటే నేటి ముంబైలో జన్మించారు. ఆయన తండ్రి ఫిరోజ్ గాంధీ, తల్లి ఇందిరా గాంధీ. ఇందిరా గాంధీ భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె. దీంతో రాజీవ్ చిన్నప్పటి నుంచే దేశ రాజకీయ వాతావరణాన్ని దగ్గరగా చూశారు. అయితే చిన్నతనం నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉన్న వ్యక్తి కాదు రాజీవ్. చదువుతో పాటు యంత్రాలు, సాంకేతికత, విమానాలపై ఆయనకు ప్రత్యేక ఆసక్తి ఉండేది. విదేశాల్లో చదువుకున్న రాజీవ్ గాంధీ తర్వాత పైలట్‌గా శిక్షణ పొందారు. రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక సాధారణ వృత్తి జీవితాన్ని గడపాలని ఆయన మొదట భావించారు. ఆయన ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా పనిచేశారు. అంటే.. దేశాన్ని పాలిస్తానని కలలు కన్న వ్యక్తి కాదు రాజీవ్ గాంధీ. పరిస్థితులు ఆయనను రాజకీయాల్లోకి తీసుకొచ్చాయి.

ఒక పైలట్‌గా జీవితాన్ని ప్రారంభించిన యువకుడు. పరిస్థితుల కారణంగా రాజకీయాల్లోకి వచ్చాడు. కేవలం 40 ఏళ్ల వయసులో దేశ ప్రధానమంత్రి అయ్యాడు. భారతదేశం భవిష్యత్తు సాంకేతికతలో ఉందని నమ్మాడు. యువతకు ఓటు హక్కు కల్పించాడు. భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు తీసుకెళ్లాలని కలలు కన్నాడు. అదే సమయంలో తన రాజకీయ నిర్ణయాలతో విమర్శలను కూడా ఎదుర్కొన్నాడు. చివరికి 46 ఏళ్ల వయసులోనే దేశం కోసం తన జీవితాన్ని కోల్పోయాడు. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జీవితం మనకు చెప్పే ముఖ్యమైన విషయం ఒక్కటే. కాలం ఎంత చిన్నదైనా.. మన ఆలోచనలు పెద్దవిగా ఉంటే చరిత్రలో మన ముద్ర శాశ్వతంగా నిలిచిపోతుంది. ఈరోజు మనం సాంకేతిక భారతదేశం గురించి మాట్లాడుతున్నప్పుడు.. దాని తొలి దశలను ఊహించిన నాయకుల్లో రాజీవ్ గాంధీ పేరు తప్పకుండా గుర్తుకు వస్తుంది. ఆగస్టు 20.. రాజీవ్

గాంధీ జయంతి. ఆయనకు నివాళి అర్పించడం అంటే కేవలం ఒక రాజకీయ నాయకుడిని గుర్తు చేసుకోవడం కాదు. భారతదేశాన్ని ఆధునిక, సాంకేతిక, యువశక్తితో కూడిన దేశంగా చూడాలన్న ఒక తరం కలను గుర్తు చేసుకోవడం. భారత్ మాతాకీ జై, జై హింద్.

© 2026 Bharath Samachar